


ముగిసిన ఎపి ఇఎపి సెట్

2,24,724 మంది హాజరు : జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపి ఇఎపిసెట్-23 ఎట్టకేలకూ శుక్రవారం ముగిశాయి. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలు విజయవంతంగా ముగిసినట్లు ఛైర్మన్ రంగజనార్ధన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో 2,38,180 మంది పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోగా తొమ్మిది సెషన్స్‌లో జరిగిన పరీక్షలకు 2,24,724 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. దీంతో 94.35 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. ఇందుకోసం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 136 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆఖరి రోజు శుక్రవారం ఉదయం 25,121 మంది హాజరుకావాల్సి ఉండగా 23,975 మంది హాజరైనట్లు తెలిపారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- సాంకేతిక సమస్యలతో పడని హాజరు
- వారానికి సగటున రూ.300 వరకు కోత
- నిబంధనల పేరుతో నిర్వీర్యం చేసే కుట్ర
- పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువు

ఉపాధి కూలికి కోతలే..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2004లో ఏర్పడిన యుపిఎ-1 ప్రభుత్వం వామపక్షల ఒత్తిడి మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని దేశవ్యాప్తంగా తీసుకొచ్చింది. ఈ పథకానికి ఇప్పటి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తూ వస్తోంది. ఈ మేరకు బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులు బాగ తగ్గించిన నేపథ్యంలో ఉపాధి పనికెళ్లే వ్యవసాయ కూలీలకు తిప్పలు తప్పడం లేదు. అన్నింటిలోనూ కోతలు పెడుతూవస్తోంది. జిల్లాలో అమలు జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనితీరును పరిశీలించేందుకు 'ప్రజాశక్తి'శుక్రవారం నాడు బుక్కరాయసముద్రం మండలంలోని బుక్కరాయసముద్రం, సిద్ధరాంపురం గ్రామాల్లో పర్యటించడం జరిగింది. ఈ రెండు గ్రామాల పరిధిలో పనిచేసే కూలీలు తమ సమస్యలను తెలియజేశారు.

బుక్కరాయసముద్రం సిద్ధరాంపురం గ్రామం పరిధిలో 585 జాబ్ కార్డులున్నాయి. 614 మంది వ్యవసాయ కూలీలు నమోదై ఉన్నారు. ప్రతి రోజూ సగటున 300 మంది వరకు ఈ గ్రామం నుంచి ఉపాధి పని కోసం వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనిలో పారదర్శక తీసుకొచ్చే పేరుతో సాఫ్టవేర్‌లో మార్పులు తీసుకొచ్చింది. దీని ప్రకారం ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనిచేసే కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. దీన్ని ఫీల్డ్ అసిస్టెంట్ చేస్తుంటాడు. అయితే ఎన్‌ఐసిలో సాంకేతిక సమస్యల కారణంగా ఫొటో అప్‌లోడ్‌లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక్కోరోజు ఫొటో అప్‌లోడ్ చేసినా సైట్‌లో చూపించడం లేదు. దీంతో ఆ రోజు కూలీలు పనిచేసినా ప్రయోజనముండటం లేదు. దీంతో కూలీలకు పనిదినాలు లేకుండాపోతున్నాయి

అన్నీ కోతలే..!

ఉపాధి కూలీలకు ప్రభుత్వం ఇస్తున్న అలవెన్సులు అన్నింటిలోనూ కోతలు పెట్టింది. ప్రధానంగా వేసవి కాలంలో గత ఏడాది వరకు ఆ రోజు పడిన కూలిపై 30 శాతం అదనంగా అలవెన్సు కింద ఇచ్చేవారు. కాని ఈ ఏడాది అది లేకుండా చేసింది. ఇక గునపం పదును చేసుకోవడానికి వారానికి రూ.50 వరకు అలవెన్సుగా ఇచ్చేవారు. దాన్ని కోతపెట్టింది. వేసవి కాలంలో వడదెబ్బకు గురవకుండా ఉండేందుకు మజ్జిగ వంటి వాటికి నిధులు ఇచ్చేది. ఐదు కిలోమీటర్లకంటే ఎక్కువగా ఉంటే రవాణా ఛార్జీలు ఉండేవి. కాని ఈసారి వాటిని ఇవ్వడం లేదు. దీంతో కూలీలకు గతేడాది కంటే వచ్చే వేతనాలు బాగా తగ్గిపోయాయి.

కానరాని కనీస సౌకర్యాలు

పని చేసే ప్రదేశంలో ఉపాధి కూలీలకు కల్పించే కనీస సౌకర్యాలు మచ్చుకైన కన్పించవు. పనులు జరుగుతున్న ఏ ప్రాంతంలో పరిశీలించినా సౌకర్యాలలేమి కన్పిస్తుంది. పనిచేసే చోట మంచినీళ్లు, మజ్జిగ, ప్రథమ చికిత్స కిట్లు, టెంట్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆచరణలో ఇవి అమలుకావడం లేదు. ఇక పనిముట్లు ఎప్పుడిచ్చారో కూడా తెలియని పరిస్థితినుంది. ఉపాధికి సంబంధించి పనిముట్లు ఇస్తారన్న సంగతి కూడా కూలీలకు తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉపాధి ప్రారంభంలో మంచినీళ్లకు రూ.5, ఉపాధి పని ప్రదేశం 5కి॥మీ॥ దాటితో రానుపోను ఛార్జీలు, గునపం సానకు డబ్బులను ప్రభుత్వం ఇచ్చేది. కొత్త విధానాలు అమల్లోకి వచ్చాక వీటిన్నంటినీ ప్రభుత్వం రద్దు చేసింది.

రూ.40 ఛార్జీకే పోతోంది..

ఊరి నుంచి పనిచేసే చోటుకు రావాలంటే సుమారు ఆరు కిలోమీటర్లు ఉంది. దీంతో ఆటో మాట్లాడుకుని రావాలి. రావడానికి రూ.20,పోవడానికి రూ.20 కలిపి మొత్తం రోజుకు రూ.40 ఛార్జీల రూపంలో పోతోంది. ఎండాకాలం కాబట్టి నేల గట్టిగా ఉండి రోజంతా కష్టపడితే రూ.200కు మించి రావడం లేదు. దానిలో రూ.40 ఛార్జీలకు పోతే రూ.160 మాత్రమే మిగులుతోంది. అందులో మస్టర్ పడకపోతే ఆ రోజు కూలీ రాదు. గతేడాది ఈఏడాది చూస్తే వారానికి సుమారు రూ.300 వరకు కూలి తగ్గింది.

హనుమంతు,
వ్యవసాయ కూలీ, కొండాపురం గ్రామం.

అలవెన్సులు ఇవ్వాలి

గ్రామ స్థాయిలో ఉపాధి హామీ చట్టం కూలీలకు ఎంతో భరోసాగా నిలుస్తోంది. కూలీలు ఈ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాయి. ఇలాంటి ఉపాధిని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోంది. నిధుల కేటాయింపులు తగ్గించింది. క్షేత్రస్థాయిలో చూసినా ఇదే స్పష్టమవు తోంది. పనిదినాలు తగ్గిపోతున్నాయి. అలవెన్సుల్లోనూ కోతలు పెడుతున్నారు. కేవలం పనిచేసిన దానికే కూలి అన్నట్టుగా ప్రభుత్వం నిబంధనలు తీసుకొస్తోంది. ప్రభుత్వం పాత పద్ధతుల్లోనే వేసవి కాలంలో ఇచ్చే అలవెన్సు ఇవ్వాలి. రవాణా ఛార్జీలూ ఇవ్వాలి. పనిదినాలు పెంచాలి.

కృష్ణమూర్తి,
ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

బెండకు తెగుళ్లు

- చేతికొచ్చిన పంట తెగుళ్లపాలు
- పెట్టుబడులూ రాని దుస్థితి
- లక్షల్లో పంట నష్టం
- అప్పుల ఊబిలో రైతులు



తెగుళ్లు సోకి ఎండిపోయిన బెండచెట్లు, కాయలు..

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ఏదో రూపంలో నష్టాలు తప్పడం లేదు. అతివృష్టి, అనావృష్టి, నకిలీ విత్తనాలు, తెగుళ్లు ఇలా ఏదో ఒకటి పంట చేతికందకుండా చేస్తోంది. కొత్తగా బెండపంటకు తెగుళ్లు సోకడంతో రైతులు పూర్తిగా నష్టాన్ని చవిచూశారు. కనీసం కూలీల ఖర్చు కూడా చేతికందని పరిస్థితి నెలకొనడంతో చేసేది లేక పంటను చేలల్లోనే వదిలేస్తున్నారు. పెద్దపప్పూరు మండల వ్యాప్తంగా బెండపంటకు కొత్తరకం తెగుళ్లతో రైతులు పూర్తిగా నష్టపోయారు.

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పెద్దపప్పూరు మండల వ్యాప్తంగా 100 హెక్టార్లలో రైతులు బెండ పంటను సాగు చేశారు. పెద్దఎక్కలూరు, చెర్లోపల్లి, తురకపల్లి, రెడ్డిపల్లి, పప్పూరు, బొందలదిన్నె తదితర గ్రామాల్లో ఈ పంటను సాగు చేశారు. బెండకు గత నెల వరకు మంచి ధర పలికింది. ధర బాగా ఉండడంతో ఈ సారి లాభాలు కళ్లజూస్తామని రైతులు భావించారు. ఈ ఆశ రైతులకు ఎక్కువ కాలం నిలవలేదు. తెగుళ్ల రూపంలో రైతుల ఆశలపై నీళ్లుచల్లినట్లు అయ్యింది. పంటచేతికొచ్చే సమయంలో కొత్త రకం వైరస్ బెండకు సోకింది. ఈ తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు ఖర్చు చేసి రసాయనాలను చల్లారు. అయినా ఫలితం లేదు. రసాయనాలు పిచికారీ చేయడం వల్ల తెగుళ్లు నశించకపోగా రైతులకు ఖర్చులే మిగిలాయి. ఈ వైరస్ సోకకముసుపు వరకు బెండ కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ధర ఉండేది. తెగుళ్లు సోకిన అనంతరం కాయ నల్లగా మారి పచ్చదనం తగ్గడంతో కనీసం రూ.10కి కూడా అడిగే వారు కరువయ్యారు. కాయలను తొలగించేందుకు కూలి ఖర్చులు కూడా రావడం లేదని భావించిన రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఎకరా బెండపంట సాగు చేసేందుకు విత్తనాలకు రూ.14వేలు, రసాయనాలకు రూ.2వేలు, దుక్కులు, కూలి తదితర ఇతర ఖర్చులన్నీ కలిపి రూ.50వేల వరకు ఖర్చు వస్తోంది. రూ.50వేలు ఖర్చు చేస్తే కనీసం రూ.10వేలు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. తెగుళ్ల కారణంగా ఉన్న కొద్దిపాటి కాతను కూడా ఏమీ చేయలేక పొలంలోనే వదిలేసే పరిస్థితి నెలకొంది. బెండకు తెగుళ్లతో రైతులు ఇబ్బంది పడుతున్నా దాని నివారణకు వ్యవసాయ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. పంట పొలాలను కూడా నామమాత్రంగానే పరిశీలిస్తున్నారు. నాశిరకం విత్తనాల వల్ల తెగుళ్ల సోకినట్లు రైతులు భావిస్తున్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు పరిశోధనలు జరిపితే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది. ఒక వేళ నాశిరకం విత్తనాల వల్లనే తెగుళ్ల సోకిఉంటే నష్టపరిహారం ఆ కంపెనీల నుంచే ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.



బెండ విత్తనాల ప్యాకెట్‌ను చూపుతున్న రైతు శేషారెడ్డి

పంట మొత్తం పోయింది..

నాకున్న రెండు ఎకరాల్లో బెండుపంటను సాగు చేశాను. అనంతపురంలోని ఫర్టిలైజర్ షాపులో శంకర్ అనే బండ విత్తనాలు 5కిలోలు తీసుకొచ్చి సాగు చేశాను. పంట సాగు కోసం దాదాపు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టాను. పంట సాగు చేసే ముందు వర్షాలు బాగా రావడంతో దిగబడి బాగా వస్తుందన్న ఆశతో పంటను సాగు చేశాను. తీరా పంట చేతికొచ్చే సమయానికి బెండకు కొత్తరకం వైరస్ సోకింది. ఒక్క రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి కన్పించడం లేదు. పెట్టుబడులు మొత్తం కోల్పోయి పూర్తిగా నష్టపోయాను. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందజేయాలి.

రైతు శేషారెడ్డి.

తెగుళ్ల నివారణకు చర్యలు

పెద్దపప్పూరు మండలంలో బెండ పంటకు కొత రకం తెగుళ్లు సోకినట్లు తమ దృష్టికి వచ్చింది. దీనిపై ఇప్పటికే ఆయా గ్రామాల్లో పర్యటించి తెగుళ్లను పరిశీలించాం. పంటకు తెగుళ్లు సోకిన మాట వాస్తవమే. దీనికి కారణాలు ఏమిటన్నది తెలుసుకుంటున్నాం. నకిలీ విత్తనాల వల్ల వైరస్ సోకినట్లు తెలిస్తే సంబంధిత కంపెనీల నుంచి రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటాం.

ఉమాదేవి, మండల ఉద్యానవన అధికారి.

నేరాలకు స్వస్తి పలకండి : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

గతాన్ని వదిలేసి నేరాలకు పూర్తిగా స్వస్తి పలికి జీవించాలని రౌడీషీటర్లు, హత్య కేసుల్లో నిందితులకు ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. జిల్లాలోని కిరాయి హంతకులు, రౌడీషీటర్లు, హత్య కేసుల్లో నిందితులు, గంజాయి స్మగ్లర్స్ తదితరులకు శుక్రవారం స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడుతూ గత నేర చరిత్రను పూర్తిగా వదిలేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి ప్రమాదకారి పదార్థాన్ని తీసుకోవడంలో ఆరోగ్యం క్షీణించడం, మరణాలు సంభవించడం మరియు జీవితాలు నాశనమవుతాయని గుర్తించాలన్నారు. హత్యలు, దోపిడీలు, రౌడీయిజం లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. నేరప్రవృత్తిలో పాత పంథా మళ్లీ పునరావతమైతే పీడీ యాక్టు, జిల్లా బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, డీఎస్పీలు జి.ప్రసాదరెడ్డి, బి.శివారెడ్డి, వి.శ్రీనివాసులుతో పాటు పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ శ్రీనివాసులు



అనంతపురంలో సుందరయ్యకు నివాళి అర్పించి, వర్ధంతి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్
- జిల్లా వ్యాప్తంగా సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తి అనుసరనీయమని, ఆయన వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాన్ని అనంతపురం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ నిర్వహించారు. సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతపురం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో గణేనాయక్, మహదేవ్‌నగర్ కాలనీ, శ్రీశ్రీ నగర్‌లో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాంభూపాల్ హాజరై సుందరయ్య జీవిత విశేషాలను తెలియజేశారు. సుందరయ్య మార్క్సిస్టు, లెనినిస్టు మూలసూత్రాల ప్రాతిపదికతో ప్రజాల కోసం విశాల పోరాటాలు నిర్మించారన్నారు. దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఆయన స్ఫూర్తితో వామపక్ష పోరాటాన్ని ముందుకు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 1వ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర నాయకులు ప్రకాష్, వలీ, మసూద్, బాబు, ప్రసాద్, ముష్కిన్, వెంకటనారాయణ, జీవ, ఎన్టీఆర్ శీన, వెంకటేష్ గణేనాయక్ నగర్ శాఖ కార్యదర్శులు వన్నూరు, దేవా, పెద్ద మసూదు, వెంకట, కృష్ణ, మహదేవ్ నగర్ శాఖ కార్యదర్శి ఎస్‌కె.మహమ్మద్, వెంకట, ఎంపిటీసీ రమీజాబీ, వార్డు సభ్యురాలు రమాదేవి, రసూల్‌బీ, శ్రీశ్రీ నగర్ కాలనీ శాఖ కార్యదర్శులు కుమార్, హరి, రాఘవ, కుళ్లాయి, జైతున్‌బీ, సావిత్రమ్మ, సురేష్ పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులు
- వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ అర్హులైన లబ్ధిదారులకు వాటిని అందించడంలో కృషి చేస్తున్న వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం అనంతపురం కృష్ణ కళామందిర్‌లో జిల్లా స్థాయి వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ అవినీతి రహితంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందిస్తున్న వాలంటీర్లను ప్రభుత్వం వజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ ఫలాలు మరింత ఎక్కువగా అందించేందుకు వాలంటీర్లు కృషి చేయాలని సూచించారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ గ్రామ, వార్డు వాలంటీర్లు రానున్న కాలంలో నాయకులు ఎదగాలని ఆకాంక్షించారు. జడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ కరోనాలాంటి విపత్కర పరిస్థితులు, అకాల వర్షాల సమయంలో వాలంటీర్లు అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జిల్లాలో 10,069 మంది గ్రామ, వార్డు వాలంటీర్లకు ప్రశంసా పత్రాలతో పాటు సేవా వజ్ర పొందిన వారికి 30 వేల చొప్పున, సేవారత్న పొందిన వారికి 20 వేలు, సేవా మిత్ర పొందిన వారికి రూ.10వేల ప్రకారం రూ.10.34 కోట్ల ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందించిందని చెప్పారు. జిల్లాలో 36 మందికి సేవా వజ్ర, 199 మందికి సేవారత్న, 9834 మందికి సేవామిత్ర పురస్కారాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్, రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న , రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ హరిత, సిడబ్ల్యూసి ఛైర్ పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఉమాదేవి, నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, సహాయ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, ఆర్డీవో మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిపిఒ ప్రభాకర్ రావు, నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కమీషనర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాలంటీర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే..

జెఎన్‌టియులో ఎన్‌బిఎ బృందం పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలను ఎన్‌బిఎ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు కమిటీ బృందం శుక్రవారం పరిశీలించింది. కళాశాలలోని సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు గుర్తింపు కోసం ఇచ్చేందుకు కమిటీ పరిశీలించినట్లు ప్రిన్సిపల్ సుజాత తెలిపారు. ముందుగా కాన్ఫరెన్స్ హాలుకు చేరుకున్న ఎన్‌బిఎ బృందానికి కళాశాలకు సంబంధించిన ప్రజెంటేషన్‌ను వివరించినట్లు తెలిపారు. అక్కడి నుంచి కళాశాల లైబ్రరీ, సైన్స్ బ్లాక్, ప్లేస్‌మెంట్, సెంట్రల్ కంప్యూటర్ సెంటర్, డిస్పెన్సరి, హాస్టళ్లు, లెక్చర్ హాల్ కాంప్లెక్స్, క్రీడా వసతులు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సివిల్ విభాగానికి కొంతమంది సభ్యులు, కెమికల్ విభాగానికి కొంతమంది సభ్యులుగా విడిపోయి పరిశీలించారు. తర్వాత ప్రయోగశాలలో పరికరాలు, తరగతి గదులు, పాఠ్యాంశాలు, రూపకల్పన, బోధనా పద్ధతులపై ఆరా తీశారు. బృందం వెంట రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, పరీక్షల విభాగం డైరెక్టర్ ఇ.కేశవరెడ్డి, ప్రిన్సిపల్ వైస్ ప్రిన్సిపల్ ఆర్.భవానీ, కెమికల్ విభాగం అధిపతి దిలీప్‌కుమార్, తదితరులు ఉన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురంకలెక్టరేట్

దేశంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ అవలంభిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేద్దామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం కళ్యాణదుర్గం పంపుహౌస్ వద్ద 'కార్మికులు, లౌకికతత్వం, మతతత్వ రాజకీయాలపై స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు కృషి చేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు అవరోధంగా, కార్మికుల ఐక్యతకు భంగం కలిగించే మతతత్వ రాజకీయాలు, నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే ఏకైక మార్గం అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశభక్తిని అడ్డుపెట్టుకుని కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లు మార్చి కార్మికుల శ్రమను దోచిపెడుతోందని ఆరోపించారు. మహాత్మ గాంధీని హత్య చేసిన ఆర్ఎస్ఎస్ గాడ్సేను దేవుడిగా అభివర్ణించే బిజెపి ఎంపిలు దేశానికి బంగారు పతకాలు సాధించిన రెజ్లర్లను వేధించిన ఎంపిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్‌ను నిషేధించిన ఆనాటి హోం మినిష్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ నిలువెత్తు విగ్రహాన్ని స్థాపించి దండలు వేస్తూ.. పుల్వామా ఘటనలో అనేకమంది సైనికుల మృతికి కారణమైన బిజెపి నాయకులు దేశభక్తి గురించి మాట్లాడుతుంటూ 'దెయ్యాలు వేదాలు' వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో.. బిజెపి మాటల్లో దేశభక్తి కూడా అంతే ఉంటుందన్నారు. రైతులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పార్లమెంట్‌లో చేసిన చట్టాలకు వ్యతిరేకంగా 370 రోజులు పోరాడి మోడీ ప్రభుత్వాన్ని మెడలు వంచి రద్దు చేసుకోగలిగామన్నారు. అదేస్ఫూర్తితో రానున్న రోజుల్లో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాము, ఉపాధ్యక్షులు ప్రభాకర్, ట్రెజరర్ వన్నూరుస్వామి, ఆర్గనైజర్ ఎం.నాగరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేనివి



బుక్కరాయసముద్రంలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

భారత కమ్యూనిస్టు, నిస్వార్థ ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య చేసిన సేవలు మరువలేనివని పలువురు వ్యక్తులు కొనియాడారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆటోస్టాండ్, ఉపాధి హామీ పనులు దగ్గర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా వ్య.కా.సం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి 1913 మే1న నెల్లూరు జిల్లా విడవనూరు మండలం అలాగానిపాడులో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా, వ్యవసాయ విప్లవ వ్యూహకర్తగా, మార్క్సిస్టు సూత్ర పరిరక్షకుడిగా నిరంతరం ప్రజలతో గడిపిన మహానేత అన్నారు. అగ్రవర్ణాల ఆధిపత్యంలోనే తన సొంత గ్రామంలో దళితుల పట్ల వివక్షతకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేసిన ఘనత దక్కుతుందన్నారు. 1932లో సొంత గ్రామంలో మొట్టమొదటిసారిగా వ్య.కా.సం స్థాపించారన్నారు. 1930 దశకంలోనే భూస్వామి వ్యతిరేక పోరాటాన్ని ప్రారంభించారన్నారు. 18 ఏళ్ల వయస్సులో కమ్యూనిస్టు జీవితాన్ని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. 1952లో పార్లమెంటుకు ఎన్నికై మొదటి ప్రతిపక్షనేతగా వ్యవహరించారన్నారు. 1955 నుంచి 1967 వరకు, 1978 నుంచి 1983 వరకు ఎమ్మెల్యేగా పని చేశారన్నారు. ప్రజాప్రతినిధిగా సైకిల్‌పై పార్లమెంటుకు, అసెంబ్లీకి వెళ్లి ప్రజాప్రతినిధులు ఎలా ఉండాలో ఆచరించి చూపి మహోన్నత వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.సం మండల అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, నాగ లింగయ్య, నాగరాజు, రైతుసంఘం నాయకులు సంజీవరెడ్డి, సిఐటియు నాయకులు నాగేంద్ర, ఎర్రన్న, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ఉద్యమ నిర్మాత, మాజీ ఎంపీ పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని శుక్రవారం ఐఎంఎల్ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యంలో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, భవన నిర్మాణ రంగం కార్మికుల యూనియన్ నాయకులు రామాంజి, బేవరేజ్ హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో శుక్రవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవి, సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ నిస్వార్థ ప్రజా సేవకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. నిత్యం ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జయమ్మ, సరస్వతమ్మ, వెంకటమ్మ, ఆవాజ్ నాయకులు వలి, అంగనవాడీలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్య.కా.సం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా, వ్యవసాయ విప్లవ వ్యూహకర్తగా, మార్క్సిస్టు సూత్ర పరిరక్షకుడిగా నిరంతరం ప్రజల కోసం పని చేశారన్నారు. ఆయన స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.సం మండల కార్యదర్శి సుంకన్న, అధ్యక్షుడు ఎర్రిస్వామి, రైతుసంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఓబిరెడ్డి, ఓబులేష్, రమేష్, మేకల పెద్దన్న, ఆంజనేయులు, కొండారెడ్డి, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, ధన, శ్రీనివాసులు, గంప మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం యల్లనూరు మండల కేంద్రంలో చిత్రపటానికి పూలామాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యమ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజారామిరెడ్డి, ఓబులేసు, రమేష్, పద్మావతి, సూరి, తదితరులు పాల్గొన్నారు.

వర్థంతి సభల్లో నాయకులు

గుత్తి : ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయులని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు వి.సావిత్రమ్మ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణ శివారులోని జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.సావిత్రమ్మ మాట్లాడుతూ 1964 నుంచి 1976 వరకు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య సిపిఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి వ్యవసాయ కూలీలు హక్కుల సాధనకై కృషి చేశారన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ, నాయకులు యు.మల్లికార్జున, ఎన్.రేణుక, ఎస్.మున్నీ, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు వి.సావిత్రమ్మ, నాయకులు

గుంతకల్లు : పుచ్చలపల్లి సుందరయ్య నిస్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు కొనియాడారు. సుందరయ్య వర్థంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు మారుతి, సాకే నాగరాజు, కసాపురం రమేష్, నాయకులు వెంకీ, మల్లికార్జున, ఆటో, టాక్సీ కార్మికులు పాల్గొన్నారు.



ఐఎంఎల్ డిపో వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

రాయదుర్గం : ఉద్యమ నిర్మాతగా సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిస్తామని, ఆయన ఆశయాల సాధనకై ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వినాయక కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ సుందరయ్య నిత్యం ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల కోసం అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బంగి శివ, మధు, తిమ్మరాజు, అంజి, నాగరాజు, రమేష్, శ్రీరాములు, కష్ణనాయక్ పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల సిఐటియు ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఓబులేసు, రాము, హమాలీ సంఘం నాయకుడు పెన్నయ్య మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య సజీవంగా మన మధ్య లేకపోయినా పేదల గుండెల్లో నిలిచి ఉన్నారని కొనియాడారు.

నేరాలు ఘోరాలు

వృద్ధుడి ఆత్మహత్య

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న దిడ్డి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వృద్ధుడి మతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాదాపు 60 ఏళ్ల వయస్సున్న వృద్ధుడు నాలుగు రోజుల క్రితం మృతిచెందినట్లు అనుమానం వ్యక్తం చేశాఉ. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా, కూల్ డ్రింక్ బాటిల్ ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గార్లదిన్నెలో వివాహిత..

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచర్ల గ్రామానికి చెందిన బ్యాళ్ల రత్నమ్మ శుక్రవారం మధ్యాహ్నం కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు.. భర్త బచ్చులప్ప పని నిమిత్తం తోటకు వెళ్లడంతో ఇంట్లో ఉన్న భార్య రత్నమ్మకు కడుపునొప్పి వచ్చింది. దీంతో నొప్పి తాళలేక ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు భర్తకు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూడగా భార్య విగతజీవిగా కనిపించింది. మృతురాలకు కొడుకు, కూతురు ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్పంచి అక్రమాలపై ఫిర్యాదు

డి.హీరేహాల్: మండల పరిధిలోని పులకుర్తి గ్రామానికి చెందిన సర్పంచి దోనప్ప అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ శుక్రవారం ఆ గ్రామస్తులు ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. పులకుర్తి గ్రామంలోని పశువులదొడ్డి బండలు పడగొట్టి వాటికి సంబంధించిన రూ. 2 లక్షల విలువ చేసే రాళ్లు, ఇతర సామగ్రిని తన ఇంటి నిర్మాణానికి వాడుకున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ చెప్పడంతో వారు వెనుదిరిగారు.

ఉచిత పశువైద్యశిబిరం

గుత్తి : మండలంలోని గాజులపల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ భారతి మాట్లాడుతూ పశువులకు ముద్ద చర్మవ్యాధి సోకకుండా టీకాలు వేయించాలన్నారు. పశువులు ఆరోగ్యంగా ఉండేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు ప్రదీప్, ఎహెచ్ఎ పవన్‌కుమార్, బాలాజీ, కిషోర్, గోపాలమిత్ర అల్లూరి, రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ ప్రకాష్, జిల్లా ప్రతినిధి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై మున్సిపల్ అధికారుల దాడులు



దుకాణంలో దాడులు నిర్వహిస్తున్న అధికారులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని పలుప్రాంతాల్లో ఉన్న దుకాణాలపై మున్సిపల్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగయ్యకలిసి దాదాపు 20 దుకాణాలపై దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయా దుకాణాలకు రూ.13,400 జరిమానా విధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్రమాదమైన ప్లాస్టిక్‌ను వాడరాదన్నారు. జ్యూట్ బ్యాగ్, జనుముతో చేసిన సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు. దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సెలవుల్లో అడ్మిషన్లు చేస్తే చర్యలు : డిఇఒ



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ సాయిరాం

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

సెలవుల్లో అడ్మిషన్లు నిర్వహించినా..పాఠశాలలు నిర్వహించినా చర్యలు తప్పవని డిఇఒ ఎం.సాయిరాం హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని కెఎస్ఆర్ పాఠశాలలో జిల్లాలోని ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో డిఇఒ సమావేశం నిర్వహించారు. ముందుగా పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఒత్తిడి కలిగించకుండా బోధన చేయాలన్నారు. సెలవుల్లో పాఠశాలల్లో అడ్మిషన్లు చేయరాదన్నారు. పాఠశాలలు తెరిచిన తర్వాతనే ప్రభుత్వ నిబంధనలకు లోబడి అడ్మిషన్లు చేయాలన్నారు. అలాగే పాఠశాలల పేర్లతో ముద్రించిన పుస్తకాలను విక్రయించరాదన్నారు. ఇకపోతే పాఠశాలలు, కళాశాలల బస్సులను కండీషన్‌లో ఉంచాలన్నారు. లైసెన్సులు కలిగిన డ్రైవర్లను ఉంచుకోవాలన్నారు. ఆయా నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డివిఇఒ ఎం.వెంకటరమణనాయక్, ఆర్ఐఒ జి.సురేష్‌బాబు, ఉపవిద్యాధికారులు పద్మప్రియ, శంకర్‌ప్రసాద్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, ఎంఇఒ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ విషయమై ప్రతిపక్ష నాయకుడు, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం రాయదుర్గంలో వైసిపి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గహం నుంచి వినాయక కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాజధానిలో 50 వేల మందికి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయిస్తే కడుపు మండిన చంద్రబాబు నోటికొచ్చినట్లు వాగుతున్నట్లు ఆరోపించారు. ఒక సెంటు భూమిలో ఇల్లు కడతారా అని ప్రశ్నించిన చంద్రబాబు రాయదుర్గం వస్తే ఒక సెంటులో ఎంత చక్కగా ఇల్లు కట్టుకోవచ్చో చూపిస్తామన్నారు. తనను అసమర్థుడని ప్రశ్నించే కాలవ టిడిపి హయాంలో మంత్రిగా నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, గౌని ఉపేంద్రరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజు నాయక్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు పాల్గొన్నారు.

విత్తనకాయల కోసం 14,435 మంది రిజిస్ట్రేషన్

అనంతపురం : ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తన వేరుశనగ కోసం జిల్లావ్యాప్తంగా రైతుభరోసా కేంద్రాల్లో 14,435 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 12,759 క్వింటాళ్ల వేరుశనగ కాయలు అవసరం అవుతాయన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆలూరులో ప్రజాసంక్షేమ యాత్ర

తాడిపత్రి రూరల్ : ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తలపెట్టిన ప్రజా సంక్షేమ యాత్ర శుక్రవారం మండల పరిధిలోని సజ్జలదిన్నె ఆలూరు మీదుగా సాగింది. ఇందులో భాగంగా ఆలూరు గ్రామంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను అందజేశారు. అదేవిధంగా వైఎస్ఆర్ జలకళ పథకానికి సంబంధించి రైతులకు మంజూరైన బోర్లు, స్టార్టర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమణమ్మ, ఎంపిపి సరస్వతి, తహశీల్దార్ మునివేలు, ఎంపిడిఒ రంగారావు, వాసుదేవరెడ్డి, వైసిపి నాయకులు ఆలూరు రామచంద్రారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లతోటల రైతులను ఆదుకుంటాం

ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పండ్ల తోటల రైతులు నష్టపోకుండా ఆదుకునేందుకు కృషి చేస్తామని ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో బుక్కరాయసముద్రం, శింగనమల మండల ఉద్యానవన, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022-23లో పండ్ల తోటల పెంపకం పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు ఈసారి రెండు, మూడు సంవత్సరాల 40శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున అధికారులు తోటలను సందర్శించి రైతుల జాబితాను తయారు చేయాలని సూచించారు. అలాగే వేసవిలో ఉద్యానవన పంటల్లో చేపట్టాల్సిన తెగుళ్లు, సస్యరక్షణ వివరాలను వివరించారు. అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల పంట నష్టపోయిన వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి, నీరు నిల్వ చేసి తోటల రక్షణకు ఫారంపాండు తవ్వకం, ఎపిఎంఐపి డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల మంజూరు కోసం ఆయా ఆర్‌బికెల్లో దరఖాస్తు చేసుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.



తహశీల్దార్ సుమతికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

'శుద్ధబెలుకు' తోలుకునేందుకు అనుమతివ్వాలని వినతి

పుట్లూరు : పొలాలకు శుద్ధబెలుకు తోలుకునేందుకు అనుమతి ఇవ్వాలని మండలంలోని పలువురు రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ సుమతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని గుట్టల నుంచి పలువురు రైతులు కొన్నేళ్లుగా పొలాలకు శుద్ధబెలుకును ట్రాక్టర్లలో తీసుకెళ్తారన్నారు. పొలాల్లో బెలుకు వేస్తే నీటి ఎద్దడిని తట్టుకునే అవకాశం ఉందన్నారు. అలాంటి బెలుకును రైతులు తరలించుకుంటుంటే ఓ ప్రయివేట్ సంస్థకు చెందిన కొంతమంది వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో రైతుల ట్రాక్టర్లు, జెసిబిలను పట్టుకుని పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారన్నారు. కావున ఇప్పటికైనా స్పందించి రైతులు శుద్ధబెలుకును తరలించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా బెలుకు తరలించుకునేందుకు ప్రయివేట్ సంస్థకి ఇచ్చిన లీజును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సురేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీఆర్ఎస్ ప్రవేశ పరీక్ష

అనంతపురం సిటీ : ఎపిఆర్ఎస్ క్యాట్ ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించనున్నట్లు డిఇఒ ఎం.సాయిరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 సెంటర్లలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఏపీఆర్జేసీ, డిసి ప్రవేశ పరీక్షలకు సంబంధించి 33 సెంటర్లలో మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడంతోపాటు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. హాల్ టికెట్ల సమస్య ఉంటే ఉదయం 7గంటలకు అన్ని ఆధారాలతో అనంతపురంలోని కెఎస్ఆర్ గర్ల్స్ హై స్కూల్‌కు రావాలన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

శింగనమల : మండల పరిధిలోని మదిరేపల్లి గ్రామంలో ఆలయ నిర్మాణానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శుక్రవారం రూ.20వేలు ఆర్థికసాయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మదిరేపల్లి గ్రామ ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : ఎంపిపి

పుట్లూరు : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సకాలంలో సేవలు అందించడంపాటు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. తహశీల్దార్ సుమతి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం కింద ప్రజలు 1902కు కాల్ చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఎంపిడిఒ యోగానందరెడ్డి మాట్లాడుతూ వాలంటీర్లకు వందనం అనే కార్యక్రమం కింద మండలంలో ఐదుగురికి సేవారత్న, 182 మందికి సేవమిత్రలుగా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇకపోతే చీనీ, దానిమ్మ తదితర రైతుల నుంచి ప్రయివేట్ వ్యక్తులు నగదు ప్రోత్సాహకాలు వస్తాయంటూ రూ.800 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు అందాయని హార్టికల్చర్ అధికారిణి ఫాజులున్నీషా బేగంను అడిగారు. ఇందుకు ఆమె స్పందిస్తూ ఈ విషయంపై తమకి ఇప్పటికే ఫిర్యాదులు అందాయని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు శివయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

బుక్కరాయసముద్రం : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న మండల పరిధిలోని పసులూరుకు చెందిన రైతు తలారి శివయ్య కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకంటామని తహశీల్దార్ మోహన్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఈమేరకు శుక్రవారం పసులూరుకు చేరుకుని ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఈమేరకు భార్య లక్ష్మి, పిల్లలను కలుసుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. పరామర్శించిన వారిలో మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచి కల్పనా చిన్నపరెడ్డి, కార్యదర్శి రవికుమార్‌రెడ్డి, విఆర్ఒ శిల్ప, మహిళా పోలీస్ రాజకుమారి, ఆశావర్కర్ సుహాసిని, ఉద్యాన సహాయకుడు మునికుమార్ పాల్గొన్నారు.

మిస్సమ్మ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోండి

సిఎం జగన్‌కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ లేఖ

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం నగరంలో దాదాపు రూ.200 కోట్ల విలువైన మిస్సమ్మ కాంపౌండ్ (సిఎస్ఐ) స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. అనంతపురంలో వున్న 7.67 ఎకరాల మిస్సమ్మ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చి స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసేందుకు 2007 నుంచి బిఎస్ఆర్ సోదరులు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ భూముల్లో నివాసముంటున్న పేదలు, విద్యాసంస్థలను ఖాళీ చేయించేందుకు పలుమార్లు దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్నారని వివరించారు. బిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఆగడాలకు గతంలో సిఎంలుగా వున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్ చంద్రబాబు అడ్డుకట్ట వేశారని తెలిపారు. అక్కడ అక్రమ కట్టడాలు జరపకుండా సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలు, విద్యాసంస్థలకు రక్షణ కల్పించేలా పోలీస్ అధికారులను ఆదేశించాలని లేఖలో కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేలా ప్రజా ప్రతినిధులుగా ప్రభుత్వంతో ఒప్పించాలని ఏపి జేఏసి అమరావతి జిల్లా ఛైర్మన్ ఆర్ఎన్.దివాకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.ఖాన్ కోరారు. శుక్రవారం అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డిలను విడివిడిగా కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి జేఏసి అమరావతి అసోసియేట్ ఛైర్మన్ మల్లారాయుడు, రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కుళ్లాయప్ప, వర్క్ ఛార్జిడ్ రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్, మహబూబ్ బాషా, రాము, లోకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపవంలో అటవీ సెక్షన్ అధికారిణి ఎం.ఫ్లారెన్స్ దీప ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారులు వెంకటేశ్వరమ్మ, వీఆర్వోలు సుదర్శన్‌రెడ్డి, సుంకన్న, అనిల్, వీఆర్ఏల సంఘం నాయకులు చంద్రారాయుడు, సందీప్, చలపతి, ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

ఆత్మకూరు : మండల పరిధిలో పంపనూరు తండా గ్రామంలో వైద్యసిబ్బంది శుక్రవారం ఇంటింటికి ఫీవర్ సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతి ఇంట్లో నీటి తొట్టెలు, పాత డబ్బాలు, కూలర్లు, టైర్లు, టెంకాయ చిప్పలు, పూల కుండీల్లో ఉన్న నీటిని పారబోయించారు. అలాగే మలేరియా సోకిన రోగి ఇంట్లో పైరేత్రం ద్రావణాన్ని, నీరు నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావణాన్ని పిచికారి చేశారు. అలాగే ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం సోకిన వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తారణాధికారి నాగేశ్వరయ్య, మలేరియ ఉప విభాగం సూపర్‌వైజర్లు నూరుబాషా, శేఖర్, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ వెన్నెల, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఉరవకొండ : విడపనకల్ మండలం గడేకల్ గ్రామపంచాయతీలో నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కన్‌స్ట్రక్షనల్ ఎడి మహేష్ శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, విద్యుత్ ఎఇ సత్యం, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, సర్పంచి సుశీల ఉమాశంకర్, లైన్ ఇన్స్‌పెక్టర్ మాధవ్‌గోకుల్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వడమే ధ్యేయం

ఉరవకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వడమే ధ్యేయంగా అభయ, నిస్వార్థ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఏర్పాటు చేసినట్లు కోచింగ్ సెంటర్ కోఆర్డినేటర్ నాగమల్లి రజినీ ఓబులేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయ ప్రాంగణంలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 23నుంచి 60 మంది విద్యార్థులకు నెలరోజులపాటు మధ్యాహ్న భోజనంతోపాటు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభయ, నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు రాజేష్, చంద్రమోహన్, శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

టవర్‌క్లాక్ బ్రిడ్జికు పూలే పేరు పెట్టాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని టవర్‌క్లాక్ వద్ద నాలుగు వరసల రోడ్డు వంతెనకు సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే పేరు పెట్టాలని టిడిపి బీసీ సెల్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్ తిరుమలరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే పేరును పెట్టడం వల్ల భావితరాలకు ఆయన ఆశయాల గురించి తెలిపిన వారం అవుతామన్నారు. ఇందుకు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు చొరవ చూపాలని కోరారు. ఇందుకు సూపరింటెండెంట్ తిరుమలరెడ్డి స్పందించి విన్నపాన్ని కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కొండా, మల్లికార్జున, జిల్లా బీసీ సెల్ నాయకులు చంద్రాయుడు, బ్యాల్ల నాగేంద్ర, నాగముణి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడికతీత పనుల పరిశీలన

రాయదుర్గం: వర్షాకాలంలో పలు వార్డులు ముంపునకు గురవుతుండడంతో మున్సిపాలి టీలో ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పట్టణంలోని ప్రధాన మురికి కాలువ ల్లో పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు, మధు టాకీస్ ఏరియా, పుట్టప్పతోట దగ్గర కాలువలోని పూడికతీత పనులను శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప పరిశీలించారు. అలాగే తీసిన పూడికను వెంటనే తొలగిం చాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌కు సూచించారు. ఆమెతో పాటు వార్డు కౌన్సిలర్లు శ్రీనివాస రెడ్డి, వార్డు ఇన్‌ఛార్జి పోరాలు శివ, గంగాధర్, రామాంజనేయులు, భీమనపల్లి దివాకర్, శానిటరీ సెక్రటరీ ఈశ్వర్‌నాయక్, మేస్త్రీలు భైరప్ప, రంగప్ప ఉన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి ముజీబ్, డి.నాగరాజు

కోర్టు ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో జుగాడ్ సిస్టం ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ముఖ్య అతిథులు జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కక్షి దారులు, న్యాయవాదులు, సిబ్బంది తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ఆర్వో వాటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విక్రాంతనాయక్, న్యాయవాదు లు లక్ష్మీనారాయణ, దయానందరెడ్డి, నాగిరెడ్డి, జావిద్, మోహన్‌నాయక్, శ్రీనివాసులు, కోమలి, హరీష్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'పరిటాల ట్రస్ట్' ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

కనగానపల్లి: మండల పరిధిలోని ముత్తవకుంట్ల గ్రామంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను శుక్రవారం సర్పంచి రామాంజనేయులు, ఎంపిటిసి శ్రీరాములు ప్రారంభించారు. మొదటి రోజు మామిళ్లపల్లి-దాదులూరు, కనగానపల్లి-పాతపాలెం, కోనాపురం- ముత్తవకుంట్లతండా జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశులు, మండల కన్వీనర్ పోతలయ్య, బట్టా సురేష్ చౌదరి, పథకమూరి అంజి, ఎంపిటిసి బిల్లే భాస్కర్, శ్రీరాములు, రాజాకృష్ణ, కుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు పేర్లు నమోదు చేసుకోండి

రొద్దం: విత్తన వేరుశెనగ కోసం ఆర్‌బికెలలో రైతుల పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఏఓ నివేదిత శుక్రవారం తెలిపారు. కావున రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకొచ్చి సంబంధిత ఆర్‌బికెలో సంప్రదించాలని సూచించారు. 30 కిలోల బస్తా ధర రూ. 1,674గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆమెతో పాటు ఏఈఓ అంజాద్ ఉన్నారు.

తిప్పమ్మ మృతికి రఘువీరా, ఈరన్న నివాళి

మడకశిర రూరల్: మడకశిర మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో శుక్రవారం డిప్యూటీ ఎమ్మార్వో రంగధామ భార్య తిప్పమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తిప్పమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కొండూరులో శాంతి కమిటీ సమావేశం

లేపాక్షి : మండల పరిధిలోని కొండూరు గ్రామంలో శుక్రవారం ఎస్ఐ మునీర్ అహమ్మద్ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హిందూపురం రూరల్ సిఐ వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలన్నారు. అన్ని కులాలు, మతాల ప్రజలు కలిసి మెలసి సోదర భావంతో మెలగాలి అన్నారు. ఎవరైనా ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్న సిఐ వేణుగోపాల్, ఎస్ఐ మునీర్

గ్రంథాలయాల పరిశీలన

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ సందర్శించారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించి లోటుపాట్లను తెలుసుకుని, శిబిరాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి కె.మహబూబ్‌బాషా, రిసోర్స్‌పర్సన్ దాదాపీరా ఉన్నారు.

సోమందేపల్లి : స్థానిక గ్రంథాలయాన్ని శుక్రవారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి పి.రమ సందర్శించి సమ్మర్ క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయానికి రావటం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానంతో పాటు సజనాత్మకత పెంపొందుతుందని తెలిపారు. ఆమె వెంట గ్రంథాలయ అధికారి మహబూబ్ బాషా ఉన్నారు.



సోమందేపల్లిలో గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కార్యదర్శి రమ



పెనుకొండలో గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కార్యదర్శి రమ

రొద్దం: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె శిబిరంలో లోటుపాట్లను తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆమెతో పాటు గ్రంథాలయ అధికారి నాగరాజు, రీసోర్స్ ఉపాధ్యాయులు మారుతి ఉన్నారు.

అమరాపురం: ప్రస్తుతం మారుతున్న సమాజంలో విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికి తీయడానికి గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని గ్రంథాలయ కన్సల్టెంట్ మారుతి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం కథలు, పాఠ్య పుస్తకాలు, దిన పత్రికలు తదితర వాటిని అందుబాటులో ఉంచామన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు పి. నరసింహమూర్తిఉన్నారు.

'డెంగీ' నివారణపై అవగాహన

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మడకశిర మండల పరిధిలోని రేకులగుంట, పెద్దపల్లి గ్రామాల్లో శుక్రవారం జాతీయ గీతిక జనతా వ్యాధుల నియంత్రణలో భాగంగా దోమల నివారణపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గునియా, మెదడువాపు, బోధకాలు, తదితర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే దోమలు వ్యక్తి చేయు వ్యాధులు, జీవిత చరిత్ర, దోమల వ్యక్తిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆర్.అనంతపురం పంచాయతీ కార్యదర్శి లలిత, ఏఎన్ఎం రాధమ్మ, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



డెంగీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలి

గోరంట్ల రూరల్ : మండలంలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను సత్వరమే పూర్తి చేయాలని పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని వివిధ సంక్షేమ పథకాల గురించి సచివాలయ సిబ్బందికి పలు సూచన లు చేశారు. గహ నిర్మాణ శాఖలో ఈకెవైసి, నాడు-నేడు పనులను సత్వరమే పూర్తి చేయాలని మండల అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అలాగే వివిధ శాఖల పనితీరుపై చర్చించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మండల అభివృద్ధిపై సమీక్ష

గోరంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 'అభివృద్ధి-సంక్షేమ పథకాలు'పై జిల్లా పంచాయతీరాజ్ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ హౌసింగ్, నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఎస్‌డిజి సర్వే, వివిధ పథకాల లబ్ధిదారులతో ఈకెవైసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘునాథ్ గుప్తా, ఇన్‌ఛార్జి ఈఓఆర్‌డి సతీష్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-లేపాక్షి

రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయాలని శ్రీసత్యసాయి జిల్లా రైతు సంఘం నాయకులు చలపతి, జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్‌రెడ్డి కోరారు. వారు శుక్రవారం మండలం పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. అందులో ఉంచిన విత్తన వేరుశనగ ప్యాకెట్లను పరిశీలించిన నాణ్యతలేని సరుకుగా గుర్తించారు. 30 కిలోల ప్యాకెట్లు ఒలిస్తే 15 కిలోల శనగ విత్తనాలు ఉన్నాయన్నారు. కావున కలెక్టర్ స్పందించి రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం పతనమయ్యే రోజులు దగ్గర పడ్డాయని ధ్వజమెత్తారు.



రైతు భరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ ప్యాకెట్లను పరిశీలిస్తున్న చలపతి, గోవింద్‌రెడ్డి

ప్రజలకు మంచి చేస్తే ఓర్చుకోలేని ప్రతిపక్షాలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రజలకు ఏదైనా మంచి జరిగితే ప్రతిపక్షాలు ఓర్చుకోలేక పోతున్నాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని శనగలగూడూరు, కొండేపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు అందుతున్న పథకాలపై ఆరాతీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పేదల కోసం పనిచేస్తుంటే టిడిపి జనసేన పార్టీలు మాత్రం పెత్తందారీ పార్టీలుగా మారాయన్నారు. ధనిక వర్గాల కోసం అవి పనిచేస్తున్నాయని విమర్శించారు. అందుకనే పేద ప్రజలకు జగనన్న ఏం చేద్దామని అన్నా కోర్టులకి వెళుతున్నారని విమర్శించారు. ఇప్పుడు న్యాయం మనవైపు ఉంది కాబట్టే, సుప్రీంకోర్టు జగనన్నకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఇంక దుష్టచతుష్టయం ఆటలు చెల్లవన్నారు. పేదల కోసం పనిచేసే జగనన్నకు మంచిరోజులు వచ్చాయన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరూ మేమెంతో ఆనందంగా ఉన్నామని గుండెల మీద చేయి వేసుకుని చెబుతున్నారని అన్నారు. పిల్లల్ని చదివించుకునే తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని తెలిపారు. చంద్రబాబు హయాంలో సంపాదించినదంతా స్కూల్ ఫీజులు కట్టడానికే సరిపోయేవని, ఇప్పుడా పరిస్థితుల్లో మార్పు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, సింగిల్‌విండో ప్రెసిడెంట్, ఎంపీటీసీలు,సర్పంచులు మండల కన్వీనర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి